క్లుప్తంగా

స్కూళ్లు తరలించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణ శివారులోని సైదాపూర్, వీణవంక మండలాలకు సంబంధించిన మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలను వేరే చోటికి తరలించాలని కోరుతూ శుక్రవారం టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్ కలెక్టర్ గోపికి ఫిర్యాదు చేశారు. పాఠశాలలకు సమీపంలోని రైసు మిల్లులతో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడనుందని, శ్వాసకోశ సమస్యలు, ఊపిరితిత్తులు చెడిపోయే ప్రమాదం ఉందని, సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు నందాల శివ ప్రసాద్, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దమెర సత్యం, టీఎస్ఎస్ఎఫ్ నాయకులు, రాజు, పరశురాం, అఖిల్, శివ, జయేందర్, రామకష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో శుక్రవారం కార్మిక మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. 9, 10వ తేదీల్లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య కోరారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాకు తరలిరావాలని కోరారు. కార్మికులు, రైతుల హక్కులను కేంద్రం కాలరాస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో కన్నం సదానందం,తాడవేని రవి,జానపట్ల దేవయ్య, రవి,వెంకటస్వామి,తిరుపతి, సదానందం,బిక్షపతి, అనిల్, శ్రీనివాస్,సత్యం, మల్లేశం పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ క్యాలెండర్..



జమ్మికుంట: పట్టణంలోని బాలికల పాఠశాలలో ఓపెన్ స్కూల్ ప్రవేశాల క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడారు. చదువు మధ్యలో మానేసిన విద్యార్థులకు ప్రభుత్వం ఓపెన్ స్కూల్ ద్వారా అవకాశం కల్పిస్తోందన్నారు. 10 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, అపరాధ రుసుముతో 31 వరకు సమయం ఉందని తెలిపారు. వివరాలకు 93911 83129 ఫోన్ నంబర్ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ దాసరి సుధాకర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సతీష్, టీచర్లు వెంకటేశ్వర్లు, ఐలయ్య, సారంగపాణి, అచార్య, సారయ్య, అవినాష్, వనజ, రమాదేవి, రమాకుమారి, రేణుక, కరుణ తదితరులు పాల్గొన్నారు.

6న బహుజన రణభేరి



మాట్లాడుతున్న నాయకులు

గంగాధర: చొప్పదండిలో 6న బహుజన సమాజ్‌వాదీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే బహుజన రణభేరి సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నియోజకవర్గ అధ్యక్షుడు నల్లాల రాజేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు 70 సీట్లు కేటాయించే ఏకైక పార్టీ బీఎస్పీ అని అన్నారు. సమావేశంలో నాయకులు సురేష్, గజ్జెల సతీష్, నెల్లి మహేశ్ తదితరులు ఉన్నారు.

ఉనికి కోసమే ప్రతిపక్షాల ధర్నా

గన్నేరువరం: ప్రతిపక్షాలు ఉనికి కోసమే ధర్నా, బంద్ చేపడుతున్నారని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న అన్నారు. శుక్రవారం గుండ్లపల్లిలో మాట్లాడారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిరంతరం ప్రజాసంక్షేమానికి, మండల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ప్రతిపక్షాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. 7న డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా గుండ్లపల్లి స్టేజీలో నిర్వహించే బహిరంగ సభ కోసం స్థలం పరిశీలించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా, మండల కోఆర్డినేటర్లు , సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, సర్పంచ్ మధుకర్, లక్ష్మణ్, యువజన విభాగం మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు సురేశ్, నాయకులు మహేందర్‌రెడ్డి, మల్లేశం, చంద్రయ్య, లింగారెడ్డి, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప కాలువలు.. డంపింగ్ యార్డులు

- పంట పొలాల్లోకి నీటితోపాటు ప్లాస్టిక్, చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పూడుకుపోతున్న కాలువలు
- చివరి ఆయకట్టుకు సాగునీరు చేరేదెలా..?
- ఉపాధిహామీ కూలీలతో పూడిక తొలగించాలని డిమాండ్



మానకొండూర్ శివారులో డీబీఎం 3 ఉప కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



ప్లాస్టిక్ కవర్లతో పూడుకుపోయిన కాలువ

దేశానికి వెన్నెముక రైతన్న. అలాంటి రైతులు ఇబ్బందులు పడేవిధంగా విజ్ఞులే కాలువల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు తదితరవి పడేస్తున్నారు. కాలువల ప్రతీ తూము, షెట్టర్ల వద్ద ముందుగా కనిపించేది ప్లాస్టిక్. ఇక జనావాసాల మధ్య నుంచి కాలువలో స్థానికులు చెత్తాచెదారం వేస్తూ డంపింగ్‌యార్డుగా మార్చేస్తున్నారు. అధికారులు తడి,పొడి చెత్త సేకరణకు ప్లాస్టిక్ బుట్టలు అందజేసి, ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డులకు చెత్తను తరలిస్తున్నా ఇంకా అవగాహన లేని కొందరు ప్లాస్టిక్‌ను కాలువల్లో పడేస్తున్నారు. అంతే కాకుండా ఉన్నత చదువులు చదివినా విద్యావంతులు సైతం మూఢాచారాలతో ఇంట్లోని దేవుడి ఫొటోలు, పూజ సామగ్రి, ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు కారులో వచ్చి సమీప కాలువల్లో పడేస్తున్నారు. ఒకప్పుడు పంటపొలాలకు తెల్లని సాగు నీరు వచ్చేది. ప్రస్తుతం ప్లాస్టిక్ కవర్లు పంట పొలాలకు చేరుతోంది. దీంతో రైతన్నలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

మానకొండూర్: ఎల్ఎండీ నుంచి సాగునీరు విడుదల చేస్తే మొదటగా పంట పొలాల్లోకి సాగునీరుతో పాటు చేరేది ప్లాస్టిక్ కవర్లే. తిమ్మాపూర్, మానకొండూర్, శంకరపట్నం మండలాల పరిధిలోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు 13 ఉప కాలువలు ఉన్నాయి. ఈ ఉప కాలువల ద్వారా వీణవంక మండలానికి కూడా సాగునీరు చేరుతుంది. కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులకు ఈ సాగునీరే జీవనాధారం. కాగా ఉప కాలువల్లో పూడిక పేరుకుపోయి ఉంది. ఎల్ఎండీ నుంచి దిగువకు సాగునీరు విడుదల చేసే అవకాశం ఉంది. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, పూడికతీస్తేనే చివరి ఆయకట్టుకు సాగునీరు సాఫీగా చేరుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చెత్తాచెదారంతో ఉపకాలువలు

ఎస్సారెస్పీ కాకతీయ కాలువ పరిధిలోని ఉప కాలువలు చెత్తాచెదారంతో నిండాయి.

- ఉప కాలువలపై నున్న మట్టి కాలువల్లోకి చేరుతోంది. రైస్‌మిల్లుల వద్ద డీబీఎం 2లో ప్లాస్టిక్ భారీగా చేరుతుంది. గతేడాది ఇక్కడ రెండు సార్లు కాలువలో చెత్త పేరుకుపోయి, కాలువలోని నీరు రహదారిపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈప్రాంతంలోని కాలువలో ఎక్కువగా ప్లాస్టిక్ పడేయడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుంది.
- మానకొండూర్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ సమీపంలోని డీబీఎం 3 లో కిలోమీటర్ల మేర సిల్ట్ పేరుకుపోయి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి కాలువ మూసుకుపోయింది. స్థానికులు కాలువలో పాతబట్టలు, ప్లాస్టిక్ పడేస్తుండటంతో కాలువ అధ్వానంగా తయారైంది.
- గట్టుదుద్దెనపల్లి వద్ద ఉన్న డీబీఎం 9 వద్ద కూడా ఇదే పరిస్థితి ఉంది. అనేక చోట్ల పూడిక మట్టి, చెత్తా చెదారం తొలగించాల్సిన అవసరం ఎంతైన ఉంది.
- ఎల్ఎండీ, ఈదులగట్టెపల్లి, గట్టుదుద్దెనపల్లి వద్ద ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువ ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో వెళ్లేవారు. ప్లాస్టిక్ కవర్లో వివిధ రకాల వ్యర్థాలను, దేవుడి ఫొటోలను కాలువలో పడేసి పోతుండటంతో కాలువలు అధ్వానం మారుతున్నాయి.

సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి

కాకతీయ కాలువల ద్వారా ఇప్పటికి ఆయకట్టు రైతులకు సాగునీరు సాఫీగా అందటంలేదు. కాలువ కింద ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు సాగునీరు అందించేందుకు మిడ్‌మానేరు ద్వారా ఎల్ఎండీకి నీటిని వదిలారు. ఎల్ఎండీ నుంచి నీరు విడుదల చేసే అవకాశం ఉంది. గతంలో గుర్తించిన పలు చోట్ల సిల్టు పూర్తి స్థాయిలో తొలగించలేదు. ఉపాధి హామీ కూలీలతో పేరుకుపోయిన చెత్తాచెదారం , సిల్ట్ తొలగిస్తే చివరి ఆయకట్టుకు సాగునీరు అందుతుందని ఆ దిశగా సంబంధిత అధి కారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పొలాల్లోకి చెత్త వస్తోంది



మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. కాలువల ద్వారా సాగునీరు పొలాల్లోకి ఆలస్యంగా చేరుతోంది. కాలువల్లో చెత్తాచెదారం, పూడిక పేరుకుపోయింది. సాగునీరు విడుదల చేస్తే కాలువల్లోని చెత్త పొలంలోకి కొట్టుకువస్తుంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కాలువల్లోని చెత్తాచెదారం, పూడిక వెంటనే తెలగించాలి.

– కొంద్ర అశోక్‌చక్రవర్తి, మానకొండూర్

గణిత బోధనపై శిక్షణ ప్రారంభం

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులకు వర్క్ బుక్, పీరియడ్ ప్లాన్‌పై శిక్షణను కోర్స్ డైరెక్టర్ సానే అనురాధ శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం నుంచి వర్క్ బుక్స్‌తో పాటుగా పీరియడ్ ప్లాన్స్ అందివ్వడంతో ఉపాధ్యాయుల బోధన అనంతరం విద్యార్థులకు అభ్యసన కృత్యాలు ఇవ్వడం వల్ల వారి ప్రగతిని తెలుసుకోవడం సులభతరమవుతుందన్నారు. పీరియడ్ ప్లాన్ ఆధారంగా ఎఫ్ఎల్ఎన్‌ని సక్సెస్ చేయాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ఏనుగు ప్రతాప రెడ్డి,పత్తేం శ్రీనివాస్,సీఆర్పీలు రంగు దామోదరాచారి, తాళ్లపెల్లి అమరేందర్, తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు అమలు చేయాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్: నియోజకవర్గంలోని అర్హులకు దళితబంధు పథకం అమలు చేయాలని కోరుతూ శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన పథకం మండలాల్లోని ప్రతి దళిత కుటుంబానికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పథకం అందని దళితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి, జిల్లా కార్యాలయ కార్యదర్శి మాడుగుల ప్రవీణ్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పాటి రాజు, కౌన్సిలర్ పైళ్ల వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న భాగ్యలక్ష్మీ



మాట్లాడుతున్న డాక్టర్ తులసీదాస్

హుజూరాబాద్: పట్టణంలోని ఎస్‌డబ్ల్యూ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్, సీడీపీవో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. పుట్టిన పిల్లలకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు చిన్నారులకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో తిరుమల, అంగన్‌వాడీ టీచర్లు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముర్రుపాల ఆవశ్యకత తెలుసుకోవాలి

చొప్పదండి: పుట్టిన పిల్లలకు ముర్రుపాలు పట్టించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్మన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి అన్నారు. పట్టణంలో తల్లిపాల వారోత్సవాల్లో శుక్రవారం పాల్గొని బాలింతలతో మాట్లాడారు. నార్మల్ డెలివరీలపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీవో కస్తూరి, రమాదేవి, మెడికల్ ఆఫీసర్ మేఘన, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో చిన్నారులకు ఆరోగ్యం

ఇల్లందకుంట: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకత వివరించారు. ఈసందర్భంగా డాక్టర్ తులసిదాస్ మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమన్నారు. పిల్లలకు ఆరునెలల పాటు తప్పకుండా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, సీహెచ్‌వో శ్యామల, హెల్త్ ఎడ్యుకేటర్ ఎ.మోహన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో సీట్లు పెంచాలి

మానకొండూర్: గురుకుల పాఠశాలల్లో దళిత విద్యార్థులకు సీట్లు పెంచాలని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రసంగిస్తూ నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే సంకల్పంతో వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రభుత్వం సీట్ల సంఖ్య పెంచాలని, దరఖాస్తు చేసినా ప్రతి దళిత విద్యార్థికి సీటు ఇవ్వాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. రాబోయే రోజుల్లో సీట్ల కోసం పోటీ పెరిగే అవకాశం ఉందని, గురుకులాల విద్యార్థులు మెడికల్ కళాశాల, ఐఐటీలో సీట్లు సాధిస్తున్నారని, ఇతర దేశాలకు వెళ్తున్నారని, గురుకులంలో నాణ్యమైన విద్య అందుతుందని సభలో పేర్కొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

జమ్మికుంట: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు.

పీడీఎస్‌యూ ర్యాలీ

జమ్మికుంట: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. మనఊరు మనబడి పనులు పూర్తి కాలేదని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చిగురుమామిడి: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జీవో 51ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలని కోరారు. విధుల్లో ఉంటూ చనిపోతే బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



సమ్మయ్యను సన్మానిస్తున్న ఉద్యోగులు

శంకరపట్నం: శంకరపట్నం తహసీల్దార్‌గా సమ్మయ్య శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాస్‌రావు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. భూపాల్‌పల్లి జిల్లాలో తహసీల్దార్‌గా పని చేస్తున్న సమ్మయ్య శంకరపట్నంకు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. విధుల్లో చేరగానే డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐలు అరుణ, లక్ష్మారెడ్డి, సిబ్బంది సన్మానించారు.

ఎఫ్‌సీఐ గిడ్డంగులను సందర్శించిన విద్యార్థులు

జమ్మికుంట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు స్థానిక ఎఫ్‌సీఐ(భారత ఆహార గిడ్డంగులు)ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కుల్లాయప్ప నాయక్ గిడ్డంగుల నిర్వహణతో ఆహార కొరత రాకుండా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ గిడ్డంగులను నిర్మించిందని వివరించారు. బియ్యం నిల్వ, సరఫరా తదితర అంశాలను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ మేనేజర్ ప్రకాశ్, మేనేజర్లు శ్రీధర్, వెంకటనారయణ, అనంద్, హెచ్ఎం సదానందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సైదాపూర్: పెండింగ్ బిల్లులు, జీతాలు చెల్లించే వరకు మధ్యాహ్న భోజనం వండటం నిలిపివేస్తామని శుక్రవారం మండల విద్యాధికారికి ఆదర్శ పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో లక్ష్మీ,లావణ్య,భాగ్యలక్ష్మీ, శ్యామల, మమత, లక్ష్మీ, రాజేశ్వరి, దేవేంద్ర, రమేష్లు ఉన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో 5 నుంచి పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతున్నట్లు మండల పశు వైద్యాధికారి పి రవీందర్, చెల్పూర్ పశువైద్యాధికారి వీరేశం శుక్రవారం సంయుక్తంగా ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం సెప్టెంబర్ 1వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన



చొప్పదండి: మండల కేంద్రంలో చొప్పదండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. 54 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 29 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం, కార్యదర్శి దూస రాము, రాజేశ్‌పవార్, కొత్తూరి మహేశ్, నరేశ్, కొల్లూరి ఆనందం, జితేందర్, వల్లాల క్రిష్ణహరి, పెద్ది లక్ష్మీకాంతం, చింతల రవి, తొడుపునూరి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● ప్రతిపక్షాల బంద్ ప్రశాంతం

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణంపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్య వైఖరికి నిరనసగా శుక్రవారం కాంగ్రెస్, సీపీఐ, వైఎస్సార్‌టీపీ, సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో చేపట్టిన మండల బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్‌ను విచ్ఛిన్నానికి అధికార పార్టీ కుట్రలు చేసిందని, ప్రజలు, వ్యాపార వర్గాలు సంపూర్ణ మద్దతు తెలిపాయన్నారు. అంతర్గత రహదారుల నిర్మాణంలోను ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అనంతరం గన్నేరువరం నుంచి గుండ్లపల్లి వరకు బైక్ ర్యాలీ చేపట్టారు.

● సదస్సు విజయవంతం చేయండి

జమ్మికుంట: పట్టణంలో 10న నిర్వహించే హుజూరాబాద్ నియోజవర్గస్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూర వెంకటేశ్వర్లు మాదిగ పిలుపు నిచ్చారు. శుక్రవారం పట్టణంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని, నియోజకవర్గంలోని మాదిగలు, ఉపకులాలు, విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

● చెక్కు అందజేత

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండపూర్ గ్రామంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి ఆంజనేయులు అందజేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

● ఆరోపణలు అవాస్తవం

మానకొండూర్: కుమారుడి పేరిట అక్రమంగా భూమి పట్టా చేయించానని మండలంలోని సదాశివపల్లికి చెందిన బావ రాజన్న, అల్లుండ్లు తిరుపతి, రాజు చేసిన ఆరోపణలు అవాస్తవమని చెంజర్ల గ్రామానికి చెందిన ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. న్యాయంగా భూమి కొనుగోలు చేశామని, భూమికి సంబంధించిన డ్యాక్యుమెంట్లు చూపారు.

● పనులు అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

మానకొండూర్: మానకొండూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం రెవెన్యూ సిబ్బంది పనులను అడ్డుకున్నారు. 1267 సర్వే నంబర్‌లోని భూమి ప్రభుత్వానిది కాదని, కొనుగోలు చేశామని కొందరు రెవెన్యూ సిబ్బందితో వాపోతూ రికార్డులు చూయించారు. భూమి విషయం తేలిన తరువాతే పనులు చేపట్టాలని అంతవరకూ పనులు చేయొద్దని రెవెన్యూ సిబ్బంది భూమి చదును చేస్తున్న వారికి సూచించారు.

● రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం

చొప్పదండి: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సభ్యత్వంపై సూరత్ హైకోర్టు విధించిన అనర్హత వేటుపై సుప్రీంకోర్టు స్టే విధించడాన్ని ప్రజాస్వామ్య విజయంగా పేర్కొన్నారు.

● కాంగ్రెస్ నాయకుల సంబరాలు

గంగాధర: రాహుల్‌గాంధీ అనర్హతపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడం బీజేపీ ప్రభుత్వంపై ప్రజాస్వామిక విజయం సాధించామని టీపీసీసీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు.

● జీపీ కార్మికుల వంటావార్పు

చిగురుమామిడి: గ్రామ పంచాయతీ కారోబార్లు, పారిశుధ్య సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని శుక్రవారం మండల కేంద్రంలో వంటావార్పు నిర్వహించారు.బస్టాండ్ ఆవరణలో వంటలు చేసి రోడ్డుపైన భోజనాలు చేసిన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. కనీస వేతనం కింద రూ.19,500 చెల్లించాలనికోరారు. కార్మికులు సమ్మెకు సీపీఐ నాయకులు సంఘీభావం ప్రకటించారు.

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం సంఘీభావం తెలిపారు. తక్కువ జీతాలతో సేవలు చేస్తున్న వారికి సరైన గుర్తింపు ఇవ్వడం లేదని తెలిపారు. కార్మికులకు బీఎస్పీ అండగా ఉంటుందని తెలిపారు.

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాయలం ఎదుట జీపీ కార్మికులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో కార్మికులు రోడ్డుపై భోజనం చేస్తూ నిరసన తెలిపారు. సమ్మెను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండల అధ్యక్షుడు సారయ్య ఆరోపించారు. మండలంలోని ఇప్పలపల్లి సర్పంచ్ శుక్రవారం గ్రామంలో చెత్త సేకరణ ట్రాక్టర్ నడిపారు.

● ముందస్తు అరెస్ట్

హుజూరాబాద్: హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి రెండో ఏఎన్ఎంలు తరలి వెళ్తున్నారనే సమాచారంతో పట్టణ, మండలంలోని ఏఎన్ఎంలను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

జమ్మికుంట: హైదరాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి వెళ్తున్న రెండో ఏఎన్ఎంలను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఏఎన్ఎంలు శ్యామల, సాజిదా,రంజితలు మాట్లాడుతూ.. సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

శంకరపట్నం: ఏఎన్ఎంలుగా రెగ్యులర్ చేయాలని కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట శుక్రవారం రెండో ఏఎన్ఎంలు నిరసన వ్యక్తం చేశారు.

● నేడు టీపీటీఫ్ ఆధ్వర్యంలో నిరసన

హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట: పెండింగ్‌లో ఉన్న సాధారణ భవిష్యనిధి బిల్లులు సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 5న జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట టీపీటీఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నామని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీపీటీఫ్ రాష్ట్ర కార్యదర్శి గుంటి ఎల్లయ్య శుక్రవారం ప్రకటనలో కోరారు.

విద్యార్థులకు జాతీయస్థాయి ప్రశంసాపత్రాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

తిమ్మాపూర్: అంతర్జాతీయ స్థాయిలో నాసా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ వివిధ రకాల ప్రాజెక్టుల సేకరణలో భాగంగా తిమ్మాపూర్ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. స్పైకా ప్రాజెక్టును తయారుచేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నాసా వారికి పంపించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా అంతరిక్షంలో వాతావరణం ఎలా ఉంటుంది, అక్కడ పరిస్థితుల గురించి పరిశోధన చేసే ప్రాజెక్టును విద్యార్థులు తయారు చేయగా నాసా వారు స్వీకరించి జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం లక్ష్మణరావు, రీజినల్ ఇన్‌చార్జి రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ విజయ్ కష్ణ, ఏవో జ్యోతి, నాసా ఇన్‌చార్జి కష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను అభినందించారు.